సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674


నంబర్‌ను సంప్రదించండి

ఎటు చూసినా అద్దె బోర్డులే!






అపార్ట్‌మెంట్‌లో టులెట్ బోర్డు



కాంక్రీట్ జంగిల్‌గా మారిన గాజువాక ప్రాంతం

గాజువాక : నిత్యం జనసందోహంతో సందడిగా కనిపించే గాజువాక ప్రాంతం ప్రస్తుతం కళ తప్పింది. ఇసుకేస్తే రాలనంత జనంతో కిక్కిరిసి ఉండే ఈ పారిశ్రామిక కేంద్రంలో, విశాఖ పట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రకటన వెలువడినప్పటి నుంచి అనేక ప్రాంతాలు ఖాళీ అవుతున్నాయి. ఈ పరిణామం వేలాది కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని, నియోజకవర్గంలో వెలిసిన 'టు లెట్' బోర్డులే ఇందుకు నిదర్శనమని స్థానికులు చెబుతున్నారు.

10 వేల ఇళ్లు ఖాళీ?



గాజువాక జోన్‌లో ఇటీవల కాలంలో సుమారు 10 వేల ఇళ్లు ఖాళీ అయినట్లు సమాచారం. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం తరువాత అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతం, ప్రైవేటీకరణ చర్యలు ప్రారంభమైన తర్వాత అదే వేగంతో ఖాళీ అవుతున్న పరిస్థితి నెలకొంది. గతంలో చిన్న చిన్న గ్రామాలుగా ఉన్న ఈ ప్రాంతం పారిశ్రామికీకరణతో మహాపట్టణంగా ఎదిగింది. షీలానగర్ నుంచి లంకెలపాలెం వరకు లక్షల ఇళ్ల నిర్మాణం జరిగి, జనాభా కూడా ఐదు లక్షలకు చేరింది. ఇతర సంస్థల్లో ఉద్యోగాలు చేసేవారి సంఖ్య పక్కనపెడితే, ఎక్కడ చూసినా స్టీల్‌ప్లాంట్‌లో పనిచేసేవారే ఎక్కువ కనిపించేవారు. గత ఐదేళ్లలో స్టీల్‌ప్లాంట్‌లో వేలాది మంది పదవీ విరమణ చేయడం, వీఆర్‌ఎస్ తీసుకోవడం, కాంట్రాక్టు కార్మికులను తొలగించడం వంటి కారణాల వల్ల ప్రాంతాలకు ప్రాంతాలే ఖాళీ అవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కారణంగానే సుమారు పది వేల ఇళ్లు ఖాళీ అయ్యాయని తెలుస్తోంది.

అప్పటికి ఇప్పటికి తేడా



ఇటీవలి కాలంలో గాజువాకలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. గతంలో గాజువాక వలసలకు కేంద్రంగా ఉండేది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వ్యవసాయం సరిగా సాగని పరిస్థితుల్లో ఆయా ప్రాంతాల నుంచి అనేక కుటుంబాలు ఇక్కడికి వలస వచ్చి స్థిరపడ్డారు. వారితో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడికి వలసలు వచ్చారు. దీంతో గాజువాక నిత్యం జనంతో కళకళలాడేది. ఎక్కువ డబ్బులిచ్చినా ఇల్లు దొరకని పరిస్థితి ఉండేది. సింగిల్ బెడ్‌రూమ్ ఇల్లు అద్దెకు తీసుకోవాలంటే కనీసం రూ. 7 వేలు చెల్లించాల్సి వచ్చేది. గత నాలుగు, ఐదు నెలలుగా ఎక్కడ చూసినా 'టు లెట్' బోర్డులే దర్శనమిస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగాలు, ఉపాధి కోల్పోయినవారు తమ సొంత ప్రాంతాలకు తిరిగి వెళ్లిపోతుండగా, మరికొంతమంది ఢిల్లీ, ముంబై వంటి నగరాలకు వలస వెళ్తున్నారు.

వ్యాపారాలు కుదేలు

గాజువాక ప్రాంతంలో ఇతర వ్యాపారాలు సైతం కుదేలవుతున్నాయి. గాజువాక వ్యాపారపరంగా కూడా చాలా ప్రతిష్ఠ కలిగిన ప్రాంతం. ఏ వస్తువు కావాలన్నా ఇక్కడ లభిస్తుంది. అయితే ఇటీవల కాలంలో స్టీల్‌ప్లాంట్‌లో జీతాలు సక్రమంగా చెల్లించకపోవడంతో ఆ ప్రభావం ఇక్కడి మార్కెట్లపై పడింది. కార్మికుల్లో కొనుగోలు శక్తి తగ్గడంతో అన్ని వ్యాపారాలు తిరోగమనంలో ఉన్నాయని తెలుస్తోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. చాలా మంది తమ ఇళ్లను సైతం అమ్మకానికి పెట్టారు. కొత్తగా వెంచర్లు ప్రారంభించినవారు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. వస్త్ర వ్యాపారాలు మందకొడిగా సాగుతున్నాయని, మంచి ఆఫర్లు ప్రకటించినా కొనేవారు తమవైపు చూడటం లేదని అనేకమంది వ్యాపారులు వాపోతున్నారు.

ఆశలు సమాధి

గాజువాకలో రోజురోజుకు జనసంఖ్య పెరుగుతుండటంతో డిమాండ్‌కు తగ్గట్టుగా ఇళ్లను నిర్మించుకున్నారు. చాలామంది వ్యాపారులు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు సైతం ఇక్కడే సొంత ఇళ్లు నిర్మించారు. తాము నివసించడానికే కాకుండా, పదవీ విరమణ తరువాత వచ్చే అద్దెతో జీవించేందుకు వీలుగా అదనపు అంతస్తులను నిర్మించుకున్నారు. ఇంకా అనేకమంది అద్దెలపైనే జీవించేందుకు వీలుగా ఇళ్లను నిర్మించారు. ఇప్పుడు ఇళ్లు ఖాళీ అవుతుండటంతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. ఈ పరిస్థితి చోటుచేసుకోవడంతో ఏం చేయాలో పాలుపోక చాలామంది తలలు పట్టుకుంటున్నారు. స్టీల్‌ప్లాంట్‌పై ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ లక్షమంది జీవిస్తున్నారని అంచనా. తాజా పరిస్థితులు దీన్ని నీరుగార్చుతుండటంతో పలువురు వేరే ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు.

శ్రమిస్తే మరిన్ని లాభాలు

భెల్ చైర్మన్ సదాశివమూర్తి



భెల్ చైర్మన్‌ను సత్కరిస్తున్న కార్మిక నాయకులు

గాజువాక: భెల్ చైర్మన్ సదాశివమూర్తి భెల్ హెచ్‌పీవీపీ యూనిట్‌ను బుధవారం సందర్శించారు. యూనిట్‌కు తొలిసారిగా విచ్చేసిన ఆయనకు అధికారులతోపాటు కార్మిక నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కర్మాగారంలో పలు విభాగాలను ఆయన సందర్శించారు. అనంతరం కార్మిక నాయకులు, అధికారులతో మాట్లాడుతూ ఉద్యోగులు శ్రమించి కర్మాగారానికి లాభాలు తీసుకొస్తున్నారన్నారు. భవిష్యత్‌లో మంచి వర్క్ ఆర్డర్‌లు లభిస్తాయన్నారు. వాటిని సకాంలో పూర్తి చేసి మరింత లాభాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భెల్ హెచ్‌పీవీపీ ఈడీ సుబ్రమణ్యం, అధికారులు గౌరీ శంకర్, ఎస్.లీలా, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు ఎస్.సాహు, బి.బాబూరావు, కొల్లి దేవుడు, పీవీఎస్ రాజు, పి.వీరబాబు, కంచిపాటి ప్రకాష్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

వందేభారత్‌కు దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలి

అగనంపూడి: విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందే భారత్ రైలుకు దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలని తూర్పు కోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ అధికారులకు లేఖ రాశారు. అలా చేస్తే బోగీలు ప్రయాణికులు లేకుండా ఖాళీగా నడపాల్సిన అవసరం ఉండబోదని పేర్కొన్నారు. విశాఖలో తెల్లవారు జామున బయల్దేరే వందే భారత్‌ను అందుకోవాలంటే గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రయాణికులు వ్యయప్రయాసలకు గురవుతున్నారని, దీంతో ఈ ప్రాంతానికి చెందిన వందలాది మంది ప్రయాణికులు వేరే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారని వివరించారు. ప్రతీరోజూ ఆక్యుపెన్సీ లేకుండానే రైలు వెళ్తుందని.. 400 నుంచి 500 వరకు సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. దువ్వాడలో హాల్ట్ విషయమై రైల్వే జనరల్‌మేనేజర్, డీఆర్‌ఎం, జీఎం సౌత్ సెంట్రల్, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆలోచించాలని కోరారు.

క్లుప్తంగా

సాంకేతిక రచనలపై అవగాహన



శాస్త్రవేత్త అకిహికోను సత్కరిస్తున్న దృశ్యం

అగనంపూడి: సాంకేతిక రచనను తేలికగా, స్పష్టంగా ఎలా రూపొందించాలో ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త అకిహికో కె.సుగామియా వివరించారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సాంకేతిక రచనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశోధనా పత్రాలు ఆమోదం పొందేందుకు అనుసరించే పద్ధతులు వివరించారు. ఐఈఈఈ విశాఖ బే సెక్షన్ ప్రొఫెసర్ ఎస్.లక్ష్మీనారాయణ, పీ.ఎస్.ఆర్.చౌదరి, డాక్టర్ సుబ్బారావు, కృష్ణ, శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ కె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదన రావు ప్రసంగించారు.

కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబానికి సాయం



కాంట్రాక్ట్ కార్మికుడికి ధైర్యం చెబుతున్న నాయుడు, ఇతర కార్మికులు

ఉక్కునగరం: ఇటీవల అనారోగ్యానికి గురైన బ్లాస్ట్‌ఫర్నేస్-1 విభాగానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు బంగార్రాజు కుటుంబానికి బ్లాస్ట్‌ఫర్నేస్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు పోలీసు నాయుడు సాయం అందజేశారు. విభాగంలో విధులు నిర్వహిస్తున్న బంగార్రాజు మంచాన పడ్డాడు. ఈ విషయం తెలిసిన పోలీసు నాయుడు బుధవారం బంగార్రాజు ఇంటికి వెళ్లి మూడు నెలలకు సరిపడే బియ్యం తదితర నిత్యావసర వస్తువులు అందజేశారు. తాము అండగా ఉంటామని ఆయనకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో విభాగం కార్మికులు పరమేష్, గోవింద్, గుర్నాథ్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లు తొలగించాలని వినతి



ఎస్ఈ శ్యాంబాబుకు వినతి పత్రం అందజేస్తున్న లతీష్

గాజువాక: జీవీఎంసీ 68వ వార్డు పరిధి గుడివాడ అప్పన్న కాలనీలో నివాసాలపై 33కేవీ విద్యుత్ లైన్లను తొలగించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ కోరారు. ఈ మేరకు ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.శ్యాంబాబుకు వినతి పత్రం సమర్పించారు. గృహాలపై విద్యుత్ లైన్లవల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందిని అర్థం చేసుకొని గృహాలపై గల విద్యుత్‌లైన్లను తొలగించాలని కోరారు. ఈ విషయంపై ఎస్ఈ సానుకూలంగా స్పందించారని, త్వరలో భూగర్భ విద్యుత్ లైన్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారని లతీష్ తెలిపారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి



ప్రచారంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

గాజువాక: కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ సీపీఐ నాయకులు బుధవారం ప్రచారం చేపట్టారు. అందులో భాగంగా గాజువాకలోని వివిధ ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ సామాన్య, పేద, మధ్యతరగతి వర్గాలపై భారాలు మోపడంలో భాగంగానే కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తోందని, ఈ మీటర్ల ఏర్పాటును ప్రజలందరూ అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.వనజాక్షి, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పి.దుర్గారావు, పల్లేటి పోలయ్య, ఈశ్వరరావు, పిల్లా పద్మ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

గాజువాక: ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని గాజువాక అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కోర్టు కేసులను పరిష్కరించుకోవడంపై మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీసీ సెక్షన్ 89 ప్రకారం కోర్టులో దాఖలు చేసిన అన్ని కేసులను మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపాల్సి ఉంటుందన్నారు. కోర్టు కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం వల్ల వివిధ లాభాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎస్.కవిత, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు యశోధర వేదమణి, కార్యదర్శి డి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి స్టీల్‌క్లబ్ వార్షికోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న స్టీల్‌క్లబ్ అధ్యక్షుడు మధుసూదనరావు

ఉక్కునగరం: ఉక్కు కనిష్ఠ అధికారుల మానసిక ఉల్లాస కేంద్రం (స్టీల్‌క్లబ్) వార్షికోత్సవ వేడుకలు ఈనెల 18 నుచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నామని స్టీల్‌క్లబ్ అధ్యక్షుడు ఎం. మధుసూదన రావు తెలిపారు. స్టీల్‌క్లబ్ 22వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18న శుక్రవారం మెగా బంపర్ హౌసీ ఏర్పాటు చేశామన్నారు. 19న సాంస్కృతికోత్సవంలో భాగంగా మెగా మ్యూజికల్ అండ్ డ్యాన్స్ నైట్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ఇండియన్ ఐడల్ గాయకులు హర్షవర్ధన్, ప్రసన్న, జయంత్ మాథుర్ తదితర గాయకులు పాల్గొంటారని.. అంతర్జాతీయ గాయకులు సుప్రీం శేఖర్ తమ గానంతో అలరించనున్నారన్నారు. 20న అంతర్జాతీయ నృత్యకళాకారిణి గుణశ్రీ ప్రత్యేక నృత్యాలు ఉంటాయని తెలిపారు. క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ మాట్లాడుతూ సభ్యుల ఆహ్లాదం కోసం నిర్వహిస్తున్న వేడుకలకు క్లబ్ సభ్యులు తమ కుటుంబ సభ్యులతో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ కార్యవర్గ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

బాధితుడికి బాసట



బాధితుని కుటుంబానికి నగదు, సరకులు అందజేస్తున్న జాగరపు శ్రీను, వినోద్‌బాలు

పెదగంట్యాడ: కష్టాల్లో ఉన్న వారికి మనవంతు సాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాగరపు శ్రీను మిత్ర బృందం అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలో పెదకోరాడలో నివాసం ఉంటున్న మొక్క కనకరాజు అనే వ్యక్తి ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు.అతని నడుము కింద భాగంలో విరిగిపోవడంతో 40 రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితిని తెలుసుకున్న జాగరపు శ్రీను, అతని స్నేహితులు బుధవారం ఆయన్ను పరామర్శించారు. స్నేహితుల నుంచి సేకరించిన రూ.25116 అతని కుటుంబ సభ్యులకు బుధవారం అందజేసి ఉదారత చాటుకున్నారు. అలాగే విప్లవ భారత్ ట్రస్ట్ ఫౌండర్ వినోద్‌బాలు వారికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో సుధమల్ల పవన్, బసా ప్రసాద్, పల్లం గిరి, గంధం సాయి, శ్రీరామ్, అజయ్, శ్రీను, ప్రవీణ్, రవీంద్ర, మోహన్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: 11కేవీ వుడా ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 18న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వుడా ఫీడర్ పరిధిలో టీఎన్నార్ రోడ్డు సిద్దేశ్వరం, వెంపళ్లనగర్, సమతానగర్, టెలిఫోన్ ఎంక్స్ఛేంజ్ రోడ్డు, సిద్దేశ్వరం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కూర్మన్నపాలెం: నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 18న కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఆపరేషన్ జోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పెరిగిన చెట్లను తొలగించడం, ఇతర మరమ్మతులు చేపడతామని ఆయన పేర్కొన్నారు. కూర్మన్నపాలెం ప్రధానరహదారి, భరత్‌నగర్, పోలీస్ స్టేషన్, శాతవాహననగర్, యాతపాలెం తదితర ప్రాంతాలకు 18న ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

గాజువాక: గాజువాక, భానోజీతోట ఇండోర్, చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని వివిధ ఫీడర్లలో 18న మెయింటెనెన్స్ పనులు నిర్వహించనున్నట్టు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలో వివిధ ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. భానోజీ తోట ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో భానోజీ తోట, రాజీవ్‌మార్గ్, సత్తెమ్మతల్లి గుడి ఏరియా, సింహగిరి కాలనీ, బీసీ రోడ్, భానోజీకాలనీ, సంజీవ్‌గిరి కాలనీలకు, బీసీ రోడ్ ఫీడర్ పరిధిలో గాజువాక మెయిన్ రోడ్, సాయిరామ్‌నగర్, మారుతీనగర్, గాంధీనగర్, శంకర్ నగర్ ప్రాంతాల్లోను, చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్‌లోని గొంతినవానిపాలెం, శ్రీకృష్ణదేవరాయ, చైతన్యనగర్ ఫీడర్ల పరిధిలో కణితి రోడ్, చైతన్యనగర్, శాంతినగర్, గొంతినవానిపాలెం, ప్రశాంతినగర్, మెహర్‌నగర్, గ్రంథాలయం వీధి, గాజువాక కోర్టు కాంప్లెక్స్, జీవీఎంసీ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, గాజువాక పీహెచ్‌సీ, ఆర్కే హాస్పిటల్ ఏరియా, చినగంట్యాడ, ఎస్సీ కాలనీలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మృతుడి కుటుంబానికి నిత్యావసర వస్తువులు



నగదు, నిత్యావసర సరకులు అందిస్తున్న శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం ప్రతినిధులు

అగనంపూడి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో అకాల మరణం పొందిన ఫార్మా ఉద్యోగి ఎర్రిబాబు కుటుంబానికి అగనంపూడికి చెందిన శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం రూ. ఐదువేల నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందించారు. రాష్ట్ర పద్మశాలి సేవా సంఘం కన్వీనర్ పప్పు రాజారావు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు కొలిపాక అప్పారావు, దొడ్డి దేముడు, బేతా హనుమంతురావు, గుదే సుశీలా గజేంద్రరావు, గుదే గజేంద్రరావు, గంధోళి నరసింగరావు, వానపల్లి జగ్గారావు పాల్గొన్నారు.

స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ కోరారు. జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో మూడు నెలలు పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. పదోతరగతి పాసై 18 నుంచి 45 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఉచిత వసతి ఉంటుందని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.అలాగే రూ. 7500 స్టైఫండ్ అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8309003957 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

లైట్లు వేయాలని వినతి

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి అగనంపూడి జాతీయ రహదారి హనుమాన్ కూడలి వరకు విద్యుద్దీకరణ చేపట్టాలని మేయర్ పీలా శ్రీనివాస రావుకు బుధవారం 86వ వార్డు టీడీపీ నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, బలిరెడ్డి సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, కొరాయి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయాన్ని సందర్శించిన తిరుమల పీఠాధిపతి



అయ్యప్ప ఆలయంలో తిరుమల పీఠాధిపతి విజయ శంకర స్వామీజీ

గాజువాక: అన్నమయ్య కళాక్షేత్రం (తిరుమల) పీఠాధిపతి విజయ శంకర స్వామీజీ బుధవారం షీలానగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ చైర్మన్ ఎస్.ఎ.నాయుడు ఘన స్వాగతం పలికారు. అయ్యప్పస్వామిని దర్శించుకొన్న అనంతరం మాట్లాడుతూ హిందూ సాంప్రదాయాలు, భారతదేశ ఇతిహాసాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయల ప్రతినిధులు చరపాక నాగార్జునరాజు, నంబారు రాజు, మరదాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువలను శుభ్రం చేశారు

సాక్షి ఎఫెక్ట్..



వుడాకాలనీ పంపుహౌస్ వెనుక వీధిలో కాలువలు శుభ్రం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది



టింపనీ స్కూల్ పక్కన కాలువలో పూడిక తీస్తున్న జీవీఎంసీ సిబ్బంది

పెదగంట్యాడ: వుడా కాలనీలో పంపుహౌస్ వెనుక, టింపనీ స్కూల్ పక్కన మురుగు కాలువల్లో చెత్త తొలగించారు. కాలువల్లో మురుగు సాఫీగా పోయేలా చర్యలు తీసుకున్నారు. ఈ నెల 16న సాక్షి పత్రికలో ప్రచురించిన ప్రజారోగ్యం గాలికి.. అనే కథనానికి శానిటరీ అధికారులు స్పందించారు. ఎన్నో రోజులుగా కాలువల్లో మురుగు తీయకుండా వదిలివేయడంతో దోమలు వృద్ధిచెంది స్థానికులు రోగాలు బారిన పడుతున్నారు. కాలువల్లో మురుగు తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని సాక్షి దిన పత్రికలో ప్రచురించిన కథనానికి స్పందించిన అధికారులు బుధవారం కాలువలు మొత్తం శుభ్రం చేయించి బ్లీచింగ్ కూడా చల్లారు. దీంతో సాక్షి దినపత్రికకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

విమల విద్యాలయంపై టీడీపీ నమ్మక ద్రోహం



వీవీవీ ముందు నిరసన దీక్షలో కార్పొరేటర్, నాయకులు

కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: విశాఖ విమల విద్యాలయం (వీవీవీ)ను తెరిచే అంశంలో టీడీపీ నమ్మక ద్రోహానికి పాల్పడుతుందని కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు ఆరోపించారు. విమల విద్యాలయాన్ని ప్రారంభించాలన్న డిమాండ్‌తో గంగారావు ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్కూల్ ఎదుట బుధవారం నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు దాటినా స్కూలు ప్రారంభించకుండా ఉక్కు యాజమాన్యం జాప్యం చేస్తుందన్నారు. డీఈవోకు అనుమతి లెటర్ ఇవ్వకుండా స్కూల్‌ను మూసివేయాలని కుట్ర చేస్తుందని మండిపడ్డారు. తద్వారా 1600 మంది పేద, కార్మిక బిడ్డలు చదువులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్కూల్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరంలో సీఐటీయూ నాయకులు వై.టి.దాస్, యు. రామస్వామి, శ్రీనివాసరాజు, ఎన్.రామారావు, వి.వి. రమణ, వేణు, సుమ, విజయలక్ష్మి, ప్రభ, ఉష తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గాజువాక

9912222749, 9705347420, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com